teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 202 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 21 జనవరి 2026 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## జ్యూరిచ్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

దావోస్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 గర్జన



05



శబరిమల బంగారం

## చోరీ కేసులో ఈడీ పంజా

మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో 21 చోట్ల సోదాలు

.. వివరాలు 2లో



## సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆగ్రహం

హోం సెక్రటరీ సీవీ ఆనంద్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

.. వివరాలు 2లో



# వాహనాల తాళాలు లాక్కోవద్దు


### పెండింగ్ చలాన్ల కోసం బలవంతం చేయొద్దు
### పోలీసులకు హైకోర్టు కీలక ఆదేశాలు



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు చెల్లించాలని వాహనదారులను బలవంత పెట్టొద్దని పోలీసులకు తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. పెండింగ్ చలాన్ల పేరుతో వాహనాల తాళాలు లాక్కోవడం, వాహనం ఆపి అక్కడికక్కడే డబ్బులు చెల్లించాలని వాహనదారులను బలవంతం చేయకూడదని స్పష్టం చేసింది. ఒక వేళ పెండింగ్‌లోఉన్న చలాన్ల వసూలు చేయాలని పోలీసులు భావిస్తే కోర్టు నోటీసులు ఇచ్చి న్యాయప్రక్రియ ద్వారా వసూలు చేసుకోవచ్చని తెలిపింది. పెండింగ్ చలాన్లు చెల్లించాలనుకుంటే పౌరులు తమ ఇష్టానుసారంతో స్వచ్ఛందంగా చెల్లించుకోవచ్చని తెలిపింది. ట్రాఫిక్ చలాన్ల విషయంలో నమోదైన పిటిషన్ పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపి ఈ ఆదేశాలు ఇచ్చింది.

## తెలంగాణలో త్రైమాసిక పన్ను రద్దు

- గూడ్స్ వాహనదారులకు ఊరట
- అమల్లోకి లైఫ్ ట్యాక్స్ విధానం
- 100 శాతం వసూళ్లే లక్ష్యం
- రవాణా శాఖ తనిఖీల నుంచి వాహనదారులకు విముక్తి




తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గూడ్స్ వాహనదారులకు ఊరటనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రవాణా రంగంలో ఏళ్లుగా ఇబ్బందికరంగా మారిన త్రైమాసిక పన్ను విధానానికి మంగళం పాడాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఇకపై కొత్తగా కొనుగోలు చేసే గూడ్స్ రవాణా వాహనాలకు ప్రతీ మూడు నెలలకోసారి పన్ను కట్టాల్సిన పనిలేదు. దీనికి బదులుగా వాహనం కొనుగోలు సమయంలోనే ఒకేసారి లైఫ్ ట్యాక్స్ (జీవితకాల పన్ను) వసూలు చేసే సరికొత్త విధానాన్ని త్వరలోనే

మిగతా 2 లో




## ప్రజల ముంగిటకే పోలీస్ సేవలు

- శాంతి భద్రతల పరిరక్షణలో కీలక సంస్కరణ
- బాధితుల ఇంటికే నేరుగా పోలీస్ బృందాలు
- సైబర్ నేర బాధితుల కోసం వినూత్న ప్రయోగం

హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజలతో అనుబంధం పెంచుకోవడం విషయంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్న తెలంగాణ పోలీస్ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బాధితుల ఇంటి వద్దే ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. పోలీస్ స్టేషన్‌కు రాని బాధితుల ఇంటి వద్దకే పోలీసులు రాబోతున్నారు. అన్ని ఫిర్యాదులు స్వీకరించేందుకు పోలీస్ శాఖ నిర్ణయం

మిగతా 2 లో

## మేడారం జాతరకు 4,000 ఆర్టీసీ బస్సులు

- భక్తుల కోసం భారీ ఏర్పాట్లు
- జాతరకు వెళ్లే మహిళలందరికీ ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ప్రకటించిన మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. తాజాగా భక్తులకు

మిగతా 2 లో



## రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడం

### సిట్ విచారణకు ముందు హరీష్ రావు ధ్వజం

### ప్రశ్నించినందుకే రాత్రికి రాత్రే సిట్ నోటీసులు ఇచ్చారని ఆరోపణ

హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం అవినీతి బయటపడిందని సీఎం రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని మాజీమంత్రి, బీఆరచవతీతీచస్ నేత హరీష్ రావు ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు వెళ్లేముందు ఆయన తెలంగాణ భవన్ కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో పుప్పాలగూడలోని తన ఇంటి వద్ద

మిగతా 2 లో

### ఫోన్ ట్యాపింగ్ ఒక లొట్టపీసు కేసు

- రాజకీయ వేధింపులకు భయపడం
- కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు





05

## బీజేపీ నూతన జాతీయ సారథిగా నితిన్ నబీన్

మోదీ, అమిత్ షా సమక్షంలో బాధ్యతల స్వీకారం


## మున్సిపల్ పోరుకు కవిత సై



05

- ఎన్నికల బరిలోకి తెలంగాణ జాగృతి
- 20 నుండి 30 స్థానాల్లో జాగృతి అభ్యర్థుల పోటీ
- హైదరాబాద్ నివాసంలో ఎన్నికల వ్యూహాలపై చర్చ

# తెలంగాణలో త్రైమాసిక పన్ను రద్దు




మొదటి పేజీ తరువాయి

అమల్లోకి తీసుకురానున్నారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ సమావేశాల్లో కీలక ప్రకటన చేయగా వాహనం ధరలో 7.5 శాతాన్ని లైఫ్ ట్యాక్స్ రూపంలో వసూలు చేసేందుకు రంగం సిద్ధం అవుతున్నది.

### పన్ను ఎగవేతకు చెక్.. ఖజానాకు కిక్

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం గూడ్స్ వాహనాలు ప్రతీ మూడు నెలలకు ఒకసారి రవాణా శాఖకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రవాణా శాఖ గణాంకాల ప్రకారం దాదాపు 25 శాతం మంది వాహన యజమానులు సకాలంలో ఈ పన్ను చెల్లించడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండటమే కాకుండా, పన్ను కట్టని వాహనాలను పట్టుకోవడానికి రవాణా శాఖ అధికారులు రోడ్లపై నిరంతరం తనిఖీలు చేయాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిపాదించిన లైఫ్ ట్యాక్స్ విధానం ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఉపయుక్తంగా మారనుంది. కొత్త విధానం ప్రకారం, వాహనం కొన్నప్పుడే 7.5% లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. దీనివల్ల వందశాతం పన్ను వసూలవుతుంది. ఒకసారి లైఫ్ ట్యాక్స్ కట్టిన వాహనాన్ని పన్ను కోసం అధికారులు ఆపాల్సిన పనిలేదు. అటు అధికారులు, ఇటు వాహనదారులకు సమయం ఆదా అవుతుంది.

### వాహనదారునికి లాభమా? నష్టమా?

సాధారణంగా గూడ్స్ వాహనాలకు పదేళ్ల కాలపరిమితి ఉంటుంది. ఆ తర్వాత ఫిట్‌నెస్ ఆధారంగా మరో మూడేళ్లు, ఆపై మరో రెండేళ్లు (మొత్తం సుమారు 15 ఏళ్లు) అనుమతి ఇస్తారు. ఆ తర్వాత వాహనాన్ని స్క్రాప్ (తుక్కు) కింద మార్చాల్సిందే. పదిహేనేళ్లపాటు ప్రతీ మూడు నెలలకు ఒకసారి పన్ను కట్టడం, మధ్యలో మర్చిపోతే పెనాల్టీలు కట్టడం వాహనదారులకు భారంగా మారుతున్నది. దీనికి బదులుగా ఆరంభంలోనే 7.5శాతం పన్ను కట్టడం వల్ల దీర్ఘకాలంలో యజమానులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రతి మూడు నెలలకోసారి ఆర్టీఏ ఆఫీసుల చుట్టూ తిరిగే పని కూడా తప్పుతుంది. ట్యాక్స్ చెల్లించకుండా ఆర్టీఏ అధికారులను తప్పించుకుని తిరిగే అవసరం ఉండబోదు.

### పాత వాహనాలకు వర్తించదు.

ఈ కొత్త విధానం కేవలం షోరూమ్ నుంచి కొత్తగా కొనుగోలు చేసే గూడ్స్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే రోడ్లపై తిరుగుతున్న (పాత) వాహనాలు మాత్రం యథావిధిగా పాత పద్ధతిలోనే త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం గూడ్స్ వాహనాల నుంచి రవాణా శాఖకు భారీ ఆదాయం వస్తున్నది. అయితే కొత్త విధానం వల్ల ప్రభుత్వానికి, వాహనదారులకు మధ్య జరిగే లావాదేవీల తీరు మారనుంది.

### ప్రస్తుతం.. త్రైమాసిక పన్ను రేట్లు..

ప్రస్తుతం వాహనం మోసే బరువును బట్టి పన్ను వసూలు చేస్తున్నారు. చిన్న గూడ్స్ వాహనాలు (3000 కేజీల లోపు) త్రైమాసికానికి సుమారు రూ. 1800 - రూ. 2500 వరకు, మధ్య రకం వాహనాలు (3000 - 7500 కేజీలు) త్రైమాసికానికి సుమారు రూ. 3500 - రూ. 5000 వరకు, భారీ వాహనాలకు త్రైమాసికానికి రూ. 6000 పైన వసూలు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా శాఖకు ఏటా సుమారు రూ. ఆరు వేల కోట్ల నుంచి రూ.ఏడు వేల కోట్ల వరకు ఆదాయం వస్తున్నది. ఇందులో గూడ్స్ వాహనాల వాటానే ఎక్కువ. కొత్తగా వచ్చే లైఫ్ ట్యాక్స్ విధానం వల్ల మొదట్లో ప్రభుత్వానికి ఒకేసారి భారీ మొత్తం సమకూరుతుంది. కానీ, దీర్ఘకాలంలో ప్రతి మూడు నెలలకు వచ్చే ఆదాయం మాత్రం ఆగిపోతుంది. అయినా ఎగవేతలను అరికట్టడం ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

# జూబ్లీహిల్స్ పీఎస్ వద్ద హైటెన్షన్

## ముగిసిన హరీశ్ రావు సిట్ విచారణ

## నాలుగున్నర గంటలపాటు విచారణ

## పోలీసులతో బీఆర్ఎస్ శ్రేణుల తోపులాట



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మంగళవారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరైన హరీశ్ రావు బయటకు రాబోతున్నారన్న ప్రచారంతో బీఆరచవతీతీచస్ శ్రేణులు ఒక్కసారిగా పీఎస్ వైపు దూసుకువచ్చాయి. అయితే బీఆరచవతీతీచస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, బీఆరచవతీతీచస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో బీఆరచవతీతీచస్ శ్రేణులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆరచవతీతీచస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది.

### నాలుగున్నర గంటలుగా విచారణ:

మరోవైపు సిట్ ఇచ్చిన నోటీస్ మేరకు మంగళవారం హరీశ్ రావు విచారణకు హాజరయ్యారు. గత బీఆరచవతీతీచస్ ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్న ఆరోపణలపై ఆయన్ను ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. 160 సీఆర్ పీసీ కింద సోమవారం హరీస్ రావుకు నోటీసులు ఇవ్వగా మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్ పీఎస్ కు విచారణ నిమిత్తం ఆయన హాజరయ్యారు. దాదాపు నాలుగున్నర గంటల పాటుహరీశ్ రావును సిట్ విచారించి ఆయన స్టేట్ మెంట్ ను రికార్డు చేశారు.

# రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడం

మొదటి పేజీ తరువాయి



మీడియాతో మాట్లాడారు. సోమవారం ఉదయం రేవంత్ బావమరిది బాగోతాన్ని బయటపెడితే రాత్రి 9 గంటలకు సిట్ నోటీసులు వచ్చాయని, మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నార న్నారు. అవినీతిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ఇలాగే చేస్తారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆరచవతీతీచస్ రిజల్ట్స్ చూసి రేవంత్ కు దిమ్మ తిరిగిందని, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా బలపడతామన్న భయం సీఎం రేవంత్ రెడ్డిలో మొదలైందన్నారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టు కూడా కొట్టివేసిందని హరీష్ రావు తెలిపారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి న్యాయవాదుల్ని పెట్టినా న్యాయం తనవైపు ఉందని గెలిచామన్నారు. తాము తప్పు చేయలేదు కాబట్టి ఎవ్వరికీ భయపడమన్నారు. మీడియాను, ప్రజల అటెన్షన్ ను డైవర్ట్ చేసేందుకు శతవిధాలా ప్రయత్నించినా వదిలిపెట్టబోమన్నారు. బొగ్గు కుంభకోణం, ఆంధ్రాకు అమ్ముడుపోవడం, పవర్ స్కామ్, అవినీతి బాగోతాలపై నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రజల పక్షాల ఆరుగ్యారెంటీలపై ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. సింగరేణిలో జరిగిన అవినీతి కుంభకోణాల గురించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఓపెన్ లెటర్ రాశారు. ఈ కుంభకోణానికి సంబంధించి అన్ని ఆధారాలను ఇచ్చేందుకు తాను రెడీగా ఉన్నానని, రేవంత్ రెడ్డితో కుమ్మక్కు కాకపోతే దీనిపై సీబీఐ విచారణ జరిపించి, నిజానిజాలను బయటకు తీసి నిందితుల్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి వందలకోట్ల సింగరేణి సొమ్మును తన సోకులకు ఖర్చు చేస్తుంటే బీజేపీ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు కేవలం ఒక అక్రమ కేసు అని, రాజకీయాలను డైవర్ట్ చేసేందుకు రేవంత్ రెడ్డి ఆడుతున్న సిల్లీ డ్రామా అన్నారు. ఎన్నిసార్లు రమ్మన్నా, ఎక్కడికి రమ్మన్నా విచారణకు వెళ్తామన్నారు. ఎంత ఇబ్బంది పెట్టినా ప్రజలకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ "ఒక లొట్టపీసు కేసు"



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): హరీశ్‌రావుకు సిట్ నోటీసులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసు ఓ లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యానించారు. విచారణ, కమీషన్ల పేరుతో మా పార్టీని నేతలను వేధిస్తున్నారని రాజకీయ వేధింపుల్లో భాగంగానే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావుకు నోటీసులు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఎన్ని విచారణలైనా చేసుకోండి మేం భయపడం. ఈ లొట్టపీసు కేసులో కేసీఆర్‌కు కూడా నోటీసులు ఇస్తారంట ఇచ్చుకోండి కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు, సుప్రీంకోర్టులు కొట్టేశాయి. అయినా ఎంక్వైరీలు చేయిస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ రేవంత్‌కు వెన్నతో పెట్టిన విద్య. రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డికి కోల్ టెండర్లు దక్కేలా ప్రయత్నాలు జరిగాయి. సింగరేణిలో స్కామ్‌ను నేను ఆధారాలతో సహా బయటపెడతా సింగరేణిలో రేవంత్ బావమరిదిని కింగ్‌పిన్ చేసి ఆయన రింగ్ తిప్పేలా చేశారు అని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సింగరేణి దోపిడీ మొదలైంది. సింగరేణి టెండర్లపై హరీష్ చేసిన కామెంట్స్‌పై ప్రభుత్వం ఎందుకు స్పందించదు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం లేదు. నైని కోల్ బ్లాక్ రద్దు వెనుక వాటాల పంచాయితీ ఉంది. నైని కోల్ బ్లాక్ కుంభకోణంపై హరీష్ మాట్లాడారనే అక్కసుతో నోటీసులు. అసెంబ్లీలో మంత్రులను హరీష్ ఫుట్‌బాల్ ఆడుకున్నారు అని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

# శబరిమల బంగారం చోరీ కేసులో "ఈడీ పంజా"



న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): శబరిమల బంగారం చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో 21 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడు అంతా దాదాపు 21 ప్రదేశాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు వివరించింది. ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్ కు సంబంధించిన స్థలాలను ఇందులో భాగంగా ఫెడరల్ దర్యాప్తు సంస్థ కవర్ చేసినట్లు సమాచారం. రాజకీయంగా సున్నితమైన ఈ కేసును కేరళ హైకోర్టు పర్యవేక్షణలో రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తు అధికారుల దుష్ప్రవర్తన, పరిపాలనా లోపాలు, అయ్యప్ప ఆలయంలోని వివిధ కళాఖండాల నుండి బంగారాన్ని సేకరించి దుర్వినియోగం చేయడానికి జరిగిన నేరపూరిత కుట్రతో సహా వరుస అవకతవకలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి.

# సినిమా టికెట్ ధరల పెంపుపై హైకోర్టు ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): సినిమా టికెట్ ధరల పెంపుపై తెలంగాణ హైకోర్టు మరోసారి సీరియస్ అయింది. పుష్ప -2 సినిమా టికెట్ల ధరల పెంపు సమయంలో హైకోర్టులో పిటిషన్ దాఖలవ్వగా ఇకపై ఏ సినిమా టికెట్ రేట్లనైనా పెంచవద్దని ఆదేశాలు జారీ చేసింది. కానీ సంక్రాంతి సందర్భంగా విడుదలైన రాజాసాబ్ సినిమాకు టికెట్ రేట్లను భారీగా పెంచడంతో ఈ అంశంపై హైకోర్టు సీరియస్ అయింది. మీకెన్నిసార్లు చెప్పాలంటూ ప్రభుత్వంపై ఫైరయ్యింది. తాజాగా సినిమా టికెట్ ధరల పెంపుపై న్యాయస్థానం అగ్రహం వ్యక్తం చేసింది. అనిల్ రావిపూడి - చిరంజీవి కాంబినేషన్లో వచ్చిన మనశంకర వరప్రసాద్ సినిమా టికెట్ ధరలను కూడా పెంచారని, ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకురాలేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. దీంతో రాష్ట్ర హోంశాఖ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న సీవీ ఆనంద్ కు కంటెంప్ట్ (కోర్టు ధిక్కరణ)నోటీసులు జారీ చేసింది. సినిమా టికెట్ల ధరల పెంపుపై సమాధానమివ్వాలని తెలిపింది. అలాగే ఇకపై ఏ సినిమా రేట్ల పెంపు విషయంపైనైనా 90 రోజుల ముందే నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

# ప్రజల ముంగిటకే పోలీస్ సేవలు



మొదటి పేజీ తరువాయి

తీసుకుంది. ఈ నిర్ణయం పోలీసు స్టేషన్ల వరకు వెళ్లి ఫిర్యాదు చేయలేని అనేక మంది బాధితులకు గొప్ప ఊరట ఇవ్వనుంది.

### సత్ఫలితాలిస్తోన్న 'సీ-మిత్ర':

ఇదిలా ఉంటే ఇటీవల సైబర్ నేర బాధితుల కోసం సదుపాయాన్ని హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రారంభింభించిన సీ -మిత్రం మంచి ఫలితాలు ఇస్తోంది. సైబర్ నేర బాధితులు ఇంటి నుంచే ఫిర్యాదు చేస్తేసీ-మిత్రం టీమ్ ఆ వెంటనే రంగంలోకి దిగుతుంది. బాధితులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీసి, ఏఐ సాంకేతికతతో లీగల్ అంశాలతో కూడిన పక్కా ఫిర్యాదు డ్రాఫ్ట్‌ను సిద్ధం చేసి వాట్సాప్ లేదా మెయిల్‌కు పంపిస్తున్నారు. బాధితులు ఆ ఫిర్యాదును ప్రింట్ తీసుకొని, సంతకం చేసి బషీర్‌బాగ్ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు కొరియర్ లేదా పోస్ట్ ద్వారా పంపాలి. ఆ కాపీ అందగానే పోలీసులు ఎఫచవతీతీచఆర్ నమోదు చేసి, ఆ వివరాలను బాధితుల మొబైల్‌క మెసేజ్ రూపంలో పంపిస్తున్నారు.

# మేడారం జాతరకు 4,000 ఆర్టీసీ బస్సులు

మొదటి పేజీ తరువాయి



ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాతరకు నాలుగు వేల బస్సులు ఏర్పాటు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు నాలుగు వేల బస్సులు, 51 పాయింట్స్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మేడారం మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఉంటుంది. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి పదివేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు. 28 నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మేడారం వెళ్ళేటప్పుడు బస్సులు నిండుతాయి. వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని అన్నారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి రెగ్యులర్ ఛార్జిల కంటే 50శాతం అదనపు ఉంటాయని వెల్లడించారు. పాత నాలుగు జిల్లాలు వరంగల్, కరీంనగర్ ఆదిలాబాద్ స్పెషల్ స్పాట్స్. మేడారంలో పర్మినెంట్ షెల్టర్స్ ఏర్పాటు చేశాము. ఒక్క నిమిషంలో నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు. ఆర్టీసీ బస్సుల కోసం 50 క్యూ లైన్స్ - 9 కిలోమీటర్లు ఏర్పాటు. ఒకేసారి వెయ్యి బస్సులు పార్కింగ్ చేసేలా వసతులు కల్పించాం. భక్తులు - ప్రయానికులు జాగ్రత్తగా వెళ్లండి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# టిజి ఎస్సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత ఉద్యోగ శిక్షణ

## కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థుల కోసం టిజి ఎస్సి స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకింగ్, రైల్వే మరియు స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఉద్యోగాలకు సంబంధించిన 5 నెలల ఉచిత శిక్షణ కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ స్టడీ సర్కిల్, వరంగల్ నందు 20.02.2026 నుండి 19.07.2026 వరకు నిర్వహించనున్న ఈ ఉచిత శిక్షణకు సంబంధించి ప్రవేశాల కోసం ప్రిలిమినరీ ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని, వార్షిక ఆదాయం 3 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా 30.01.2026 లోపు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 08.02.2026 న ఎంపిక పరీక్ష నిర్వహించ బడుతుందని తెలిపారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్, వరంగల్ నందు ఉచిత శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం మరియు స్టడీ మెటీరియల్ అందించబడుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ విలువైన అవకాశాన్ని అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి శ్రీమతి ఈ ఇందిర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహణ



భూపాలపల్లి, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు శ్రీమతి విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు, సంఘ కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి సునీల్, అసోసియేట్ అధ్యక్షులు మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు రాజేందర్, సంతోష్ కుమార్, ఇందిర, స్వాతి, మల్లేశ్వరి, సమ్మయ్య, శ్రీనివాస్, బాలు నాయక్, భరత్ ఆనంద్, శ్రీజ, తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. అలాగే, రాబోయే రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలు, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నట్లు వారు తెలిపారు.

## అభివృద్ధి సంక్షేమ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్



మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మంగళవారం న్యూఢిల్లీలోని నీతి అయోగ్ కార్యాలయం నుండి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం (ఆస్పిరేషనల్ బ్లాక్) ఆకాంక్షిత మండలాల జిల్లాల కలెక్టర్లతో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల ఆమోదం అమలుపై వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్లోని ఎనచవతీతీచసి సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల ఆకాంక్షిత మండలాలు (ఆస్పిరేషనల్ బ్లాక్) అభివృద్ధికి ఎంపిక అయిన కేంద్రాలను గుర్తించి నిధులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. జిల్లాలోని గంగారం మండలం ఆకాంక్షిత మండలాలలో దేశంలోనే 2024, డిసెంబర్ మాసంలో డెల్టా ర్యాంకింగ్ లో దేశంలోనే ప్రథమ స్థానం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపిక కాబడినదని, అందులో భాగంగానే మండల పరిధిలో హెల్త్ ,ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ లపై అభివృద్ధి దిశగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన సూచించారు. గంగారం మండల పరిధిలోని ప్రజల సౌకర్యార్థం నూతన అంగన్వాడి భవన నిర్మాణం, ఇప్ప పువ్వు లడ్డు తయారీ కేంద్రం, క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరిరక్షణ సామర్థ్యం పెంచడం కోసం అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో కలిసి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్ హల్కే, జిల్లా వెల్ఫేర్ అధికారిని సబిత, ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణ్, సిడిపిఓ శిరీష, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

## ధన్ ధాన్య యోజన అమలుపై సమీక్షా



జనగాం జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ప్రధాన్ మంత్రి ధన్ ధాన్య యోజన అమలు పై కేంద్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ ఆఫీసర్ రిషి కాంత్, ( జాయింట్ సెక్రటరీ, గవర్నమెంట్ అఫ్ ఇండియా) జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా గతంలో రూపొందించిన 6 సంవత్సరాల కార్యాచరణ ప్రణాళిక మండల స్థాయిలో లక్ష్యాల సాధనపై) వివిధ శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. పథకంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు అనగా పంటల ఉత్పాదకత పెంపొందించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబన, రైతులకు సులభతరంగా ఋణ సహాయం అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి , మేలైన నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి గురించి చర్యలు చేపట్టాలని టెక్నికల్ ఆఫీసర్ రిషి కాంత్, ( జాయింట్ సెక్రటరీ, గవర్నమెంట్ అఫ్ ఇండియా) సూచించారు. పథకంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు అనగా పంటల ఉత్పాదకత పెంపొందించడం, సుస్థిర వ్యవసాయ పద్ధతుల అవలంబన, రైతులకు సులభతరంగా ఋణ సహాయం అందించడం, ప్రత్యామ్నాయ పంటల సాగు, వ్యవసాయ అనుబంధ పరిశ్రమల అభివృద్ధి , మేలైన నీటి యాజమాన్యం, వ్యవసాయ రంగంలో సాంకేతికత అభివృద్ధి గురించి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్, సహకార విభాగం, భూగర్భ జలాలు, పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖలు, నాబార్డ్ ఖఢ్రవ, లీడ్ బ్యాంక్ మేనేజర్, మరియు ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## హరీష్ రావుని విచారణకు పిలవడం నిరంకుశ పాలనకు నిదర్శనం

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



భూపాలపల్లి, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుపై ఫోన్ ట్యాపింగ్ విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష్యపూరితంగా వారిని విచారణకు పిలవడం ే పా య ్ ం వా ై న , ్ర వ జా స్వా వ్యా ని కి విరుద్ధమైన చర్యగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పరిగణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, వాటి నుంచి తప్పించుకునే కుట్రలో భాగంగా ప్రతిపక్ష పార్టీ నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలు ముఖ్యమంత్రి అయిన నాటి నుంచే చేస్తున్నారు. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ అనే అస్త్రాన్ని ఉపయోగించి హరీష్ రావు గారిపై కేసులు పెట్టి రాజకీయ కుట్రలకు పాల్పడ్డారు. హరీష్ రావుపై విచారణ అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినప్పటికీ, నిన్న మళ్లీ విచారణకు పిలవడం అనేది పూర్తిగా ప్రతిపక్షాన్ని ఎదుర్కోలేని అసహనానికి నిదర్శనం. భారత రాష్ట్ర సమితికి ఉన్న అపార ప్రజాదరణను చూసి, మునిసిపల్ ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులను ఎదుర్కొనే ధైర్యం లేక, బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలను వేధింపులకు గురిచేసే ప్రయత్నం ఈ ప్రభుత్వం చేస్తోంది. ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ భయపడదు. ఎంతమందిని విచారణలకు పిలిచినా, ఎంతమంది కార్యకర్తలను వేధించినా, బీఆర్ఎస్ పార్టీ రెట్టింపు ఉత్సాహంతో ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది. ఈ ప్రభుత్వాన్ని పదవి నుంచి దించే వరకు ప్రజాపక్షంలో పోరాడటం ఖాయం. ఈ క్రమంలో అసెంబ్లీలో పార్టీ ఉపనాయకుడిగా హరీష్ రావు గారు ప్రభుత్వ వైఫల్యాలను, బొగ్గు కుంభకోణంలో వేల కోట్ల రూపాయల అవినీతిని ధైర్యంగా బయటపెడుతున్నందుకే ప్రభుత్వం ఇలాంటి ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. కాంగ్రెస్ పార్టీ ప్రజావ్యతిరేక చర్యలను ప్రజలు క్షేత్రస్థాయిలో గమనిస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీలను అమలు చేస్తే ప్రజలు హర్షిస్తారు. లేకపోతే, ఇలాంటి నిరంకుశ చర్యలతో చరిత్రలో తప్పకుండా చరిత్రహీనుడిగా మిగిలిపోతారు.

## రమణన్న బస్తీబాట కార్యక్రమంలో గండ్ర దంపతులు



భూపాలపల్లి, జనవరి 20 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు జవహర్నగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రమణన్న బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మరియు వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ భూపాలపల్లి జిల్లా బిఆరచవతీతీచస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత పదేళ్ళ కేసీఆర్ పాలనలో భూపాలపల్లి ముఖ చిత్రాన్ని మార్చినం. భూపాలపల్లి చిన్న గ్రామాన్ని నగర పంచాయతీగా, మున్సిపాలిటీ నేడు జిల్లాగా తీర్చిదిద్దడంలో మా కృషి ఎంతో ఉంది అని మీకు గుర్తుచేస్తున్నాం. అడగందే అమ్మకూడా అన్నం పెట్టదు, కానీ కేసీఆర్ మన కష్టాలు చూసి ప్రజలకు ఏమి చేస్తే బాగుంటుందో అలోచించి పెన్షన్ రూ.200/- నుండి రూ.2000/- పెంచి వృద్దులకు, వితంతువులకు పెద్దకొడుకు అయిండు, కళ్యాణ లక్ష్మి ఇచ్చి మేనమామ అయిండు. రైతులకు రైతు బంధు ఇచ్చి రైతు బాంధవుడు అయిండు. మిషన్ భగీరథ ద్వార ప్రతి ఇంటికి మంచినీరు ఇచ్చి అపర భగీరథుడు అయిండు. కానీ బూటకపు మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మభ్య పెడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీపై కక్ష్య సాధింపు చర్యలు చేపట్టడం, ఒక్క ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి నోటికి ఏదీ వస్తే అది మాట్లాడుతూ చిన్నపిల్లలు సైతం అసహ్యాయించుకునే విదంగా మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. భూపాలపల్లి పట్టణాని అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేసి,పనులు మొదలుపెడితే ఆ పనులను ఆపివేసి కమిషన్ల కోసం ఆ నిధులను ఆయన సొంత గ్రామానికి రోడ్లు వేసుకున్నాడు, గణపురం చెఱువు మీద రోడ్లు వేసిండు. నీకు దమ్ముంటే కొత్త నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలి కానీ మనం మంజూరు చేసిన నిధులను వాళ్ళు తీసుకొచ్చినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటు. అందుకే మనం ఈ దొంగల కాంగ్రెస్ పార్టీకి బుద్ది చెప్పాలి అంటే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి ఎవరైన వారికీ మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి గెలిపిస్తే రేవంత్ రెడ్డి చెంపచెల్లుమన్నట్టే, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు యువత పాల్గొన్నారు.



## జనవరి 23న 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్న తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ విజయవంతమైన ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమాన్ని ఇప్పుడు కరీంనగర్ ప్రాంతానికి విస్తరిస్తోందని సీఈఓ తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సీఈఓ మెరాజ్ ఫహీం తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు మరియు వ్యవస్థాపకులను ఉద్దేశించిన ఈ కార్యక్రమం జనవరి 23న ఉదయం 10 గంటలకు కరీంనగర్ ఐటీ టవర్ లో జరగనుందని తెలిపారు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, సిద్దిపేట మరియు కరీంనగర్ జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇన్నోవేషన్ పంచాయత్ కార్యక్రమం ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన వేదికని, తమ ఆలోచన, ఆవిష్కరణ లేదా పారిశ్రామిక ప్రయాణం గురించి సందేహాలు ఉన్న ఏ వ్యక్తికైనా, రాష్ట్రంలోని వ్యవస్థాపక నిపుణుల నుండి వ్యక్తిగత, మార్గదర్శకత్వం మరియు సలహాలు పొందేందుకు ఇది ఒక గొప్ప అవకాశమని ఆయన తెలిపారు. రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలకు వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, తక్షణ మరియు స్పష్టమైన సహాయాన్ని అందించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, జనవరి 23న జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు, నిపుణులతో నేరుగా చర్చించే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వ్యాపారం లేదా సాంకేతిక సవాళ్లను అక్కడికక్కడే (శీఅ-ష్ట్రవ-ంజూశీ) పరిష్కరించడానికి మార్గదర్శకత్వం, ఆలోచన ధ్రువీకరణ, నమూనా అభివృద్ధి, వ్యాపారాన్ని విస్తరించే ప్రక్రియపై సలహాలు మరియు ప్రభుత్వ కార్యక్రమాలు, ఇంక్యుబేషన్ సహాయాన్ని నేరుగా పొందడానికి కనెక్షన్‌లను సులభతరం చేసే అవకాశం ఉంటుందన్నారు. అంకురాలకు మద్దతుగా, సమ్మిళిత వాతావరణాన్ని నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం బలపరుస్తుందని, కాబట్టి, కరీంనగర్ చుట్టుపక్కల జిల్లాల నుండి వచ్చిన ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులు ఈ కార్యక్రమంలో తప్పకుండా పాల్గొనాలని ఆయన సూచించారు. పాల్గొనే ఆసక్తి ఉన్న వారు, ఈ క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ గురించి

తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ప్రభుత్వంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ విభాగం ద్వారా స్థాపించబడినది. స్టేట్ ఇన్నోవేషన్ పాలసీ కింద 2017లో రూపొందించబడిన తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ రాష్ట్రంలో ఆవిష్కరణలను ప్రోత్సహించి, వాటిని పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుందని, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలలో కీలక పాత్రధారులుగా ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు మరియు ఆవిష్కరణ ఉత్ప్రేరకాలుగా ప్రాధాన్యతనిచ్చే సమగ్ర విధానంతో విభిన్నమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థకు మద్దతునిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# నిర్ణీత సమయంలో అన్ని పనుల పూర్తి



తాడ్వాయి, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మేడారం మహాజాతరకు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున తుది దశకు చేరుకున్న అన్ని పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి, అవసరమైన మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం లోని మేడారం హరిత హోటల్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులు ఎక్కువగా ఇబ్బందులు పడే అంశాలైన తాగునీరు, మరుగుదొడ్లు, వంటివి నిర్వహణ మరింత మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే భక్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం జంపన్న వాగులో నిరంతరం షిఫ్టుల వారీగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాతర ప్రాంతంలోని కీలక ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్లను మోహరించాలని తెలిపారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 50 పడకల ఆసుపత్రిలో నిపుణులైన వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మేడారం జాతరను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే జాతర నిజంగా విజయవంతమైనదిగా భావించవచ్చని పేర్కొంటూ, ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఈ నెల 18న మేడారంలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని ఎలాంటి అంతరాయాలు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను అభినందించారు. రాష్ట్ర చరిత్రలో హైదరాబాద్ వెలుపల నిర్వహించిన కేబినెట్ సమావేశాన్ని కూడా సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించిందని ఆయన పేర్కొన్నారు. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సజావుగా నిర్వహించినందుకు అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇది జిల్లా యంత్రాంగం సమన్వయం, అంకితభావానికి నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి




## కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిసిపి అంకిత్ కుమార్ తో కలసి అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఖుష్ మహల్ వద్ద నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా వేడుకలు సజావుగా జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో వేడుకలు నిర్వహించనున్నందున అందుకనుగుణంగా వేదిక, సీటింగ్ ఏర్పాట్లను పక్కాగా చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొటోకాల్ ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని, అగ్నిమాపక యంత్రాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఈ నెల 25 లోగా ప్రశంసా పత్రాలు సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమ-ర్థవంతంగా నిర్వహిస్తూ.. వేడుకలు విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, ఆర్డిఓలు సుమా, ఉమారాణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ గ్రామాన ప్రచార కార్యక్రమాలు

## ప్రభుత్వ రాయితీల ప్రోత్సాహం

మహబూబాబాద్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మంగళవారం మరిపెడ, చిన్నగూడురు మండలాలలోని వివిధ గ్రామాలలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ ఆధికారి జినుగు మరియన్న పర్యటించారు. ఈ సందర్భంగా అధికారి రైతులతో జిల్లాలో రోజు రోజుకు పెరుగుతున్న కూరగాయల సాగు విస్తీర్ణం రోజు తినే టమోటా, పచ్చి మిరప, ఉల్లి, వంగ, బెండ, బీర, కాకర, దోస, ఆకుకూరలు, అపుడప్పుడు తినే చిక్కుడు, గోరు చిక్కుడు, దొండ, చిలగడదుంప (మొరం గడ్డ), బంగాళా దుంప, చేమ గడ్డ, కంద, మునగ అరుదుగా తినే బీట్ రూట్, క్యారెట్, క్యాబేజ్, కాలీఫ్లవర్, ముల్లంగి కూరగాయల సాగులో నూతన, ఆధునిక పద్దతులు పాటించుట మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని అన్నారు. సాగు-షేడ్ నెట్ లలో, ట్రెల్లిస్, ఎగబాకించే పద్ధతి, పందిరి సాగు మొదలైన నూతన ఆధునిక పద్ధతులు. రైతులు నిత్యం ఆదాయం ఇచ్చే కూరగాయల పంటల సాగు వైపు మరలాలి. జిల్లాలో 5 వేల ఎకరాల పై చిలుకులో కూరగాయల సాగు చేస్తున్నారు. రైతులు కూరగాయల సాగుకు పలు రాయితీలు ఎకరానికి రూ.2100/- అంతర పంటల సాగుకు, ఎకరానికి రూ.10,000/- కూరగాయల నారు మొక్కలను సరఫరా రాయితీ సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. టమాట పంటను యాసంగి కాలంలో రైతులు సాగుచేస్తున్నారు. రవాణాకు అనుగుణంగా నాలుగు ఐదురోజులు తాజాగా నిల్వ వుంటుంది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వలన దిగుబడి ఆశాజనకంగా ఉంది. దిగుబడి అధికంగా రావడం వలన రైతులు ఆనందంగా ఉన్నారు. మార్కెట్ కూడా అందుబాటులో ఉండటం వలన రైతుకు మంచి ధర లభిస్తుంది. అధిక ఆదాయం కొరకు రైతులు టమాట ఉపఉత్పత్తులు అయిన టమాట పచ్చళ్ళు మరియు సాస్ ల తయారీలో ఉపయోగించి అదనపు ఆదాయం పొందవచ్చునని అన్నారు.

### టమాటతో లాభాలు / పోషకాలు :

సీజన్ లో దొరికే టమాట -- అందానికి ఆరోగ్యానికి బాట విటమిన్లు ఏ, బీ, సీ, కే, కాల్షియం, పొటాషియం కలిగి ఉంటుంది. ఇందులో దొరికే లైకోఫిన్ యాంటి యాక్సిడెంట్ గా పనిచేస్తుంది.దీనిలో ఉండే లెప్టిన్ అనే ప్రోటీన్ వల్ల శరీరం బరువు తగ్గుతుంది.కంటి సమస్యలు రాకుండా చేస్తుంది దంతాలు పటిష్టంగా ఉంచుతుంది. మొటిమలు తగ్గిస్తుంది చక్కర శాతం క్రమబద్ధీకరిస్తుంది. చర్మాన్ని శుభ్రపరుస్తుంది మెరిపునిస్తుంది, యవ్వనంగా కనిపించేటట్లు చేస్తుంది.చర్మ క్యాన్సర్ నుంచి రక్షణ కల్పిస్తుంది -- బి.పి నియంత్రిస్తుంది. కొవ్వు తగ్గిస్తుంది. ప్రస్తుతం దొరికే టమాటను వినియోగించుకొని కూరలు, పచ్చడి, రసం, సాస్, జామ్, కెచప్ వంటివి తయారు చేసుకోని అధిక ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు. మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలని, నిత్యం రోగనిరోధక శక్తికి, ఆరోగ్యంగా ఉండటానికి పోషకాలు అందించే పండ్ల తోటలు అయిన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, అవకాడో, ఫ్యాషన్ ఫ్రూట్, కూరగాయలు, ఆకు కూరలు, మునగ, వెదురు మొదలైనవి సాగు చేయాలని తద్వారా ఎకరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజ మాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రో ట్రే లో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు పద్ధతులు పాటించాలని అన్నారు.

# సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్న ప్రభుత్వ మాజీ చీఫ్ విప్



హనుమకొండ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలకు ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ , మాజీ శాసనసభ్యులు, బీఆరఎవతీతీచస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ సతీసమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి గద్దెలను మంగళవారం రోజున దర్శించుకున్నారు. అమ్మవార్లకు బెల్లాన్ని సమర్పించారు. కొబ్బరికాయ కొట్టి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల పూజారులు బెల్లం ప్రసాదం అందించి, కండువా కప్పి సత్కరించారు.

# జిల్లాలో 13 గ్రామాల్లో రీసర్వే చేపట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుండి రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ రీ సర్వేపై అన్ని జిల్లాల కలెక్టర్లుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూ సర్వే చట్టం సెక్షన్ 5(1), 6(1) కింద గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేసి, జిల్లాలో మొదట దశగా మొత్తం 13 గ్రామాలను రీ సర్వే చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ఈ గ్రామాల్లో గ్రామ నక్షాలు (గ్రామ పటాలు) లేకపోవడం లేదా అస్పష్టంగా ఉండడం వల్ల రైతుల పొలాల హద్దులను ఖచ్చితంగా నిర్ణయించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనివల్ల గట్టు (సరిహద్దు) వివాదాలు తరచుగా ఉత్పన్నమవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రీ సర్వే ద్వారా రైతులకు పలు ప్రయోజనాలు చేకూరనున్నాయని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో

### పొలాల గట్టు హద్దులు, రోడ్లు, చెరువులు, కాలువలు,

గ్రామ కంటం భూములు తదితరాలను ఖచ్చితంగా గుర్తించి, శాస్త్రీయ పద్ధతిలో హద్దు రాళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రతి రైతు భూమికి సంబంధించిన అక్షాంశాలు, రేఖాంశాలుతో కూడిన ఖచ్చితమైన భూ పటాలను అందజేయడం జరుగుతుందని చెప్పారు. దీని ద్వారా భూ వివాదాలు పూర్తిగా నివారించబడతాయని, భూ లావాదేవీలు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా, జనవరి 20 (తీన్మార్ న్యూస్): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈనెల 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహణకు వివిధ కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో జాతీయ ఓటర్ల దినోత్సవం సంబంధించిన వివిధ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్కూల్స్ లో, కాలేజీలలో ఓటు ప్రాముఖ్యత పై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలని,

సీనియర్ సిటిజన్స్ గుర్తించి వారిని నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా సన్మానించాలని, ఫ్లాష్ మాబ్ , మానవహారంతో పాటు సాంస్కృతిక కళాజత బృందాలచే ఓటర్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆరఎవతీతీఎ విజయలక్ష్మి జెడ్పిసిఓ రాంరెడ్డి ఆర్డీవోలు సుమ,ఉమా రాణిలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ

పరకాల, జనవరి 20 (తీన్మార్ న్యూస్): పరకాల మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో కీ.శే కనుకుంట్ల రాజమౌళి దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ, టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ మడికొండ శ్రీను, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొచ్చు జెమిని, ఎడ్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట అభివృద్ధికి "రూ.100 కోట్లు"

## మహిళా శక్తికి వడ్డీ లేని రుణాలు

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



యాదాద్రి భువనగిరి, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రూ. 100 కోట్లతో యాదగిరిగుట్టలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలు యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో గల స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.98,23,458 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టామన్నారు.

### ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ప్రవేశ పెట్టిందని రాష్ట్రంలో 265 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణం చేసినట్లు అందుకు గాను ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ధనిక కుటుంబ సభ్యులు ఏ బియ్యం అయితే తింటున్నారో అవే సన్న బియ్యం ప్రతి పేద ప్రజలు కడుపు నిండా అన్నం తినాలనే లక్ష్యంతో మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అర్హులైన 16,152 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలు ఆర్థికంగా, బలోపేతం చేయడం కోసం పెట్రోల్ బంకులు కూడా మహిళల పేరున ఇస్తున్నామన్నారు. ప్రతి పేద వారు సొంత ఇంట్లో ఉండాలనే గొప్ప లక్ష్యంతో ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. యాదగిరిగుట్ట తో పాటు యాదగిరిగుట్ట టౌన్ కూడా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

### ప్రతి ఇంటికి గోదారి జలాలు

అందుకోసం 100 కోట్లతో యాదగిరిగుట్టలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. కొత్తగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. యాదగిరిగుట్టలో 210 కోట్ల వ్యయ తో చేపట్టిన పైప్ లైన్ పనులు త్వరలో పూర్తి కావొస్తున్నందున ప్రతి ఇంటికి గోదారి జలాలు అందుతాయన్నారు. గంధమల్ల రిజర్వాయర్ ప్రాజెక్ట్ పూర్తి అయితే పరిసర ప్రాంతాలకు, రైతులకు లక్ష ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రజాపాలన ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఆడ బిడ్డకు పుట్టింటి సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

### అభివృద్ధి పథంలో యాదగిరిగుట్టను ముందంజలో

18 సంవత్సరాల నుండి 100 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి మహిళలకు ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. త్వరలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అభివృద్ధి పథంలో యాదగిరిగుట్టను ముందంజలో ఉండాలన్నారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంకు గాను వివిధ బ్యాంకులు మరియు శ్రీనిధి వారి సహకారంతో 87 సంఘాలకు రూ.12,73,00,000 బ్యాంకు లింకేజి చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు.

# మున్సిపల్ సమరానికి ముమ్మర కసరత్తు

## కలెక్టర్లతో ఎన్నికల కమిషనర్ రాణి వరుస వీడియో కాన్ఫరెన్స్‌లు




హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని కసరత్తు వేగవంతం చేశారు. ఎన్నికల ఏర్పాట్లు, ఓటరు జాబితాల రూపకల్పన, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె వరుసగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నారు. తాజాగా మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఎన్నికల సన్నద్ధతను సమీక్షించారు. నేడు ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో రాణి కుముదిని సమావేశం కాబోతున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె దిశానిర్దేశం చేయనున్నారు. ఇక రేపు ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ షెడ్యూల్ కూడా ఫిక్స్ అయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలు, సిబ్బంది నియామకం, శాంతిభద్రతల పరిరక్షణ వంటి కీలక అంశాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించబోతున్నట్లుగా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్లకు ఎసచవతీతీచసీ రాణి కుముదిని పర్‌ఫెక్ట్ గైడ్‌లైన్స్ ఇవ్వనున్నారు.

# మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టును త్వరగా ఆమోదించండి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

## ప్రభుత్వం తరఫున ప్రక్రియలు పూర్తి చేసినట్లు వెల్లడి



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-II మంజూరు కోసం కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశం మేరకు, మెట్రో ఫేజ్-II కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేయాల్సిన కార్యక్రమాలన్నీ చేపడుతోందని తెలియజేస్తూ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-II నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఇద్దరు అధికారులతో కూడిన ఒక సంయుక్త కమిటీలో చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇద్దరు అధికారులను నామినేట్ చేసేందుకు వేచి చూస్తోందని కిషన్ రెడ్డి జనవరి 15వ తేదీన రాసిన లేఖలో పేర్కొన్న అంశాలను ప్రస్తావిస్తూ, దానికి సంబంధించిన వివరాలను కూడా ముఖ్యమంత్రి తన లేఖలో తెలియజేశారు. కమిటీ కూర్పునకు సంబంధించిన వివరాలను ఇప్పటికే కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. మెట్రో రైల్ ఫేజ్-II మంజూరు కోసం నిరంతరం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని, ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఫేజ్-II ప్రాజెక్టును తన పలుకుబడిని ఉపయోగించి వీలైనంత తొందరగా ఆమోదింపజేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

# మున్సిపల్ పోరుకు కవిత సై

## ఎన్నికల బరిలోకి తెలంగాణ జాగృతి

## 20 నుండి 30 స్థానాల్లో జాగృతి అభ్యర్థుల పోటీ

## హైదరాబాద్ నివాసంలో ఎన్నికల వ్యూహాలపై చర్చ



హైదరాబాద్, జనవరి 20 (తీన్మార్ న్యూస్): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి నేతలు బరిలో దిగుతారని కవిత స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్ లోని తమ నివాసంలో కవిత ఆశావహులతో భేటీ అయ్యారు. ఎన్నికల్లో రచించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలపై కవిత. చెర్చించారు. కాగా ఈ ఎన్నికల్లో నిజామాబాద్ లో 20 నుండి 30 స్థానాల్లో జాగృతి అభ్యర్థులు బరిలో దిగబోతున్నట్టు తెలుస్తోంది. సింహం గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థులను ప్రకటించేలా కవిత కసరత్తు చేస్తున్నారు. దీంతో సింహం గుర్తును జాగృతి కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇక కవిత తొలిసారిగా సొంతగడ్డపై బరిలో దిగుతుండటంతో జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. ఇంతకుముందు నిజామాబాద్ ఎంపీగా బీఆరచవతీతీచస్ పార్టీలో పనిచేసిన కవిత ఇప్పుడు సొంతపార్టీతో రావడంతో ఉత్కంఠ నెలకొంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్, నిజామాబాద్ లో మంచి పట్టు ఉన్న బీజేపీ అదే విధంగా తన తండ్రి పార్టీ బీఆరచవతీతీచస్ లను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరంగా మారింది.

# బీజేపీ నూతన జాతీయ సారథిగా నితిన్ నబీన్

## మోదీ, అమిత్ షా సమక్షంలో బాధ్యతల స్వీకారం



న్యూ ఢిల్లీ, జనవరి 20 (తీన్మార్ న్యూస్): భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం జరిగిన నామినేషన్ల తర్వాత ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధిష్ఠానం ప్రకటించింది. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా పాల్గొని నితిన్ నబీన్‌ను సత్కరించారు. ప్రస్తుతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, ఇప్పుడు పూర్తి స్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం పండుగ వాతావరణాన్ని తలపించింది.

### అగ్రనేతల సమక్షంలో నబీన్ బాధ్యతల స్వీకారం

ఈ వేడుకలో ప్రధాని మోడీతో పాటు పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితర అగ్రనేతలు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు. జాతీయ ఎన్నికల అధికారి కె. లక్ష్మణ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఎన్నిక ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే సాగింది. దేశవ్యాప్తంగా ఉన్న 36 రాష్ట్ర యూనిట్లలో 30 మంది రాష్ట్ర అధ్యక్షులు ఎన్నికైన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మొదలైంది.

### ఏకగ్రీవంగా ఎన్నిక

నితిన్ నబీన్ పేరును ప్రతిపాదిస్తూ మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి అగ్రనేతలే ఆయన పేరును ప్రతిపాదించడం విశేషం. జనవరి 19న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య జరిగిన నామినేషన్ల ప్రక్రియలో నితిన్ నబీన్ తప్ప మరెవరూ పోటీలో లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పార్టీలో 'సంగఠన్ పర్వ్' పేరుతో జరిగిన ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ద్వారా నూతన సారథిని ఎంచుకున్నారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, కీలక నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా సీనియర్ నేతలు హాజరయ్యారు.

# జ్యూరిచ్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

## దావోస్ వేదికగా తెలంగాణ రైజింగ్ 2047 గర్జన




తెలంగాణ బ్యూరో, జనవరి 20 (తీన్మార్ న్యూస్): ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు-2026 లో పాల్గొనేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ చేరుకుంది. విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి ప్రవాస తెలంగాణ వాసులు ఘన స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు ఉండగా, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇప్పటికే దావోస్ చేరుకొని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో తెలంగాణ బృందం అత్యంత కీలకంగా వ్యవహరించనుంది. ఈ పర్యటనలో ప్రధానంగా 'తెలంగాణ రైజింగ్ 2047' రోడ్‌మ్యాప్‌ను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి పరిచయం చేయనున్నారు. గత డిసెంబర్‌లో ప్రభుత్వం ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా, రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి, భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది. తొలిరోజు నుంచి ముఖ్యమంత్రి వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించనున్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, పారిశ్రామిక విధానాలు, భవిష్యత్తు అభివృద్ధి లక్ష్యాలను ఆయన వివరించనున్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో తెలంగాణను ప్రపంచ స్థాయి పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో సాగుతున్న ఈ పర్యటనపై రాష్ట్రవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.




# డయాబెటిస్ వచ్చే ముందు కనిపించే లక్షణాలు ఇవే.!

నేటి ఆధునిక జీవనశైలిలో డయాబెటిస్ ఒక సాధారణ సమస్యగా మారింది. చిన్న వయసులోనే చాలా మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. డయాబెటిస్ వచ్చే ముందు నుంచే శరీరం కొన్ని సంకేతాలు ఇస్తుంది. వాటిని తొలిదశలోనే గుర్తించి జాగ్రత్తలు తీసుకోకపోతే రక్తంలో చక్కెర స్థాయి పెరిగే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం.. అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం వల్ల 30ఏళ్ల లోపే మధుమేహం వస్తోంది. క్లోమం తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయకపోవడం లేదా ఉత్పత్తి అయిన ఇన్సులిన్ సరిగా పనిచేయకపోవడం వల్ల రక్తంలో చక్కెర పెరుగుతుంది. దీని వల్ల గుండె, కళ్లు, మూత్రపిండాలు, నరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది.

గతంలో మనుషులు ఎక్కువగా శారీరకంగా పని చేసేవారు. కానీ ఇప్పుడు వ్యాయామం తగ్గి, ఒత్తిడి పెరిగింది. పైగా జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇవన్నీ శరీరంలో చక్కెర స్థాయిని పెంచుతాయి. అందుకే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### డయాబెటిస్ వచ్చే ముందే కనిపించే కొన్ని ముఖ్య లక్షణాలు..

- ఎక్కువ దాహం వేయడం, తరచూ టాయిలెట్‌కు వెళ్లాల్సి రావడం డయాబెటిస్‌కు ముఖ్య సంకేతాలు. శరీరంలో చక్కెర పెరిగితే అది మూత్రం ద్వారా బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తుంది. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు.
- డయాబెటిస్ ఉన్నవారికి ఉదయాన్నే అలసటగా, నీరసంగా అనిపించవచ్చు. బాగా తిన్నా, నిద్రపోయినా శక్తి లేకపోవడం కనిపిస్తుంది. శరీరం గ్లూకోజ్‌ను సరిగా ఉపయోగించుకోలేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.
- మెడ వద్ద నల్లటి మచ్చలు కనిపిస్తే జాగ్రత్త పడాలి. ఇది ఇన్సులిన్ సరిగా పనిచేయడం లేదన్న సంకేతం కావచ్చు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.
- తిన్న వెంటనే మళ్లీ ఆకలి వేయడం, ఎక్కువగా తీపి పదార్థాలు తినాలనిపించడం కూడా డయాబెటిస్ లక్షణాలు. రక్తంలో చక్కెర స్థాయిల్లో మార్పుల వల్ల ఇలా జరుగుతుంది.
- భోజనం చేసిన తర్వాత కళ్లు మసకగా కనిపించడం, తలనొప్పి రావడం పదే పదే జరుగుతుంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఇది రక్తంలో చక్కెర ఎక్కువగా పెరగడం లేదా తగ్గడం వల్ల జరుగుతుంది.
- అకస్మాత్తుగా బరువు పెరగడం డయాబెటిస్ వచ్చే అవకాశాన్ని పెంచుతుంది.
- ఈ లక్షణాల్లో ఏదైనా కనిపిస్తే వాటిని సాధారణంగా తీసుకోకుండా శరీరం ఇస్తున్న హెచ్చరికలుగా భావించాలి. ముందుగానే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకుంటే డయాబెటిస్‌ను నియంత్రించ వచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

# అరటిపండు తినడానికి సరైన సమయం ఇదే



అరటి అనేవి ఏడాది పొడవునా సులభంగా లభించే పండు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఇష్టపడే పండ్లలో ఇది ఒకటి. కానీ అరటిపండ్లను సరైన సమయంలో తింటేనే దాని నుంచి పూర్తి ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. సరైన సమయానికి తినకపోతే, అందులోని పోషకాలు శరీరానికి పూర్తిగా అందకపోవచ్చు. అందుకే అరటిపండ్లు తినడానికి సరైన సమయం ఏమిటో తెలుసుకోవడం చాలా అవసరం.

### ఉదయం అరటిపండు తింటే

ఉదయం ఖాళీ కడుపుతో అరటిపండు తినడం వల్ల శరీరానికి వెంటనే శక్తి లభిస్తుంది. ఇందులోని విటమిన్ బీ6, పొటాషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా మలబద్ధక సమస్య ఉన్నవారికి ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

### వ్యాయామం చేసే ముందు

జిమ్‌కు వెళ్లే ముందు లేదా వ్యాయామం ప్రారంభించే ముందు ఒకటి లేదా రెండు అరటిపండ్లు తినడం మంచిది. ఇవి శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి. అలాగే కండరాలకు తిమ్మిరి రాకుండా చేయడంలో, కండరాలను బలంగా ఉంచడంలో పొటాషియం సాయపడుతుంది.

### భోజనం తర్వాత

భోజనం చేసిన తర్వాత అరటిపండు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అరటిపండ్లలో ఉండే ఫైబర్ పేగుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరంలో ఉన్న విష పదార్థాలను బయటకు పంపడంలో కూడా ఇది సహాయపడుతుంది.

### సాయంత్రం వేళ

సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య ఆకలి వేసినప్పుడు జంక్ ఫుడ్‌కు బదులుగా అరటిపండు తినడం చాలా మంచిది. ఇది ఆరోగ్యానికి హానికరమైన స్నాక్స్ తినే అలవాటును తగ్గిస్తుంది. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత వారికి అరటిపండు ఇవ్వడం ఉత్తమం. సాయంత్రం 7 గంటల తర్వాత పండ్లు తినకపోవడం మంచిది, ఎందుకంటే అవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది.

# వెన్నునొప్పి.. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకండి



చాలా మందికి తరచుగా వెన్నునొప్పి వస్తుంటుంది. అయితే, అలసట, వయస్సు పెరగడం లేదా సరైన భంగిమలో కూర్చోకపోవడం వల్లే వెన్నునొప్పి వస్తుందని తేలికగా తీసుకుంటారు. కానీ ఇలా తరచూ లేదా ఎక్కువకాలం వెన్నునొప్పి ఉంటే అది కొన్ని తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చని వైద్యులు చెబుతున్నారు.

వెన్నునొప్పి ఒక్కటే కాకుండా నడవడంలో ఇబ్బంది, వెన్ను లేదా మెడలో దృఢత్వం, చేతులు, కాళ్లలో జలదరింపు, బలహీనత, ఎక్కువసేపు కూర్చోవడం లేదా నిలబడటంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం తప్పకుండా జాగ్రత్త పడాలి. కొన్నిసార్లు ఈ నొప్పి మెల్లగా పెరుగుతూ వంగడం, కూర్చోవడం, లేవడం వంటి సాధారణ పనులకు కూడా ఇబ్బంది కలిగిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సమస్య సాధారణం కాదని అర్థం చేసుకోవాలి. కారణాన్ని గుర్తించి సకాలంలో చికిత్స తీసుకోవడం చాలా ముఖ్యం.

### వెన్నునొప్పి ఏ వ్యాధుల కారణంగా రావచ్చు?

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. వెన్నునొప్పికి అనేక కారణాలు ఉండవచ్చు. డిస్క్ జారిపోవడం వల్ల నరాలపై ఒత్తిడి ఏర్పడి తీవ్రమైన నొప్పి రావచ్చు. అలాగే సర్వైకల్ లేదా లంబార్ స్పాండిలోసిస్, స్పాండిలైటిస్ వంటి సమస్యలు కూడా వెన్ను, మెడ నొప్పికి కారణమవుతాయి. ఎముకలు బలహీనపడే ఆస్టియోపోరోసిస్, నరాలకు సంబంధించిన సమస్యలు, గాయాలు లేదా దీర్ఘకాలంగా ఉండే మంట కూడా వెన్నునొప్పిని పెంచుతాయి. ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చోని పని చేయడం కూడా ఈ సమస్యలను పెంచుతుంది.

### జాగ్రత్తలు

- వెన్నెముక ఆరోగ్యంగా ఉండాలంటే సరైన భంగిమలో కూర్చోవడం, నిలబడటం చాలా అవసరం.
- ఎక్కువసేపు ఒకే స్థితిలో ఉండకుండా మధ్య మధ్యలో లేచి నడవాలి.
- రోజూ తేలికపాటి వ్యాయామం, యోగా లేదా నడక అలవాటు చేసుకోవాలి.
- భారీ బరువులు ఎత్తకుండా జాగ్రత్త పడాలి.
- నిద్రించేందుకు సరైన పరుపు ఉపయోగించాలి.
- వెన్నునొప్పి ఎక్కువకాలం కొనసాగితే తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి.

# నిద్రలేమితో ఇన్‌ఫెర్టిలిటీ!



నిద్ర సుఖమెరుగదని పెద్దల మాట. అదే నిద్రను మనం నిర్లక్ష్యం చేస్తే.. జీవితంలో సుఖం అనేదే లేకుండా పోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మన ఫెర్టిలిటీని చంపేసే అతిపెద్ద శత్రువు నిద్రలేమే! అందుకే వైద్యులు నిద్రలేమిని 'బిగ్గెస్ట్ ఫెర్టిలిటీ కిల్లర్' అంటున్నారు!'

### ఇప్పుడు నిద్రపోవడాన్ని ఒక 'ఆప్షన్'

లా మార్చేశాం. రాత్రిళ్లు ఫోన్లు చూడటం, అర్ధరాత్రి దాకా పని చేయడం లేదా వెబ్ సిరీస్‌లు చూడటం ఈ రోజుల్లో చాలా నార్మల్ అయిపోయింది. దీనివల్ల అలసట, తలనొప్పి రావడం మనకు తెలుసు. కానీ, నిద్రలేమి అనేది అటు పురుషుల్లో, ఇటు మహిళల్లో సంతానోత్పత్తి సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని గైనకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. అసలు మన నిద్రకి, మన శరీరంలోని 'ఇంటర్నల్ క్లాక్'కి ఉన్న లింక్ ఏంటి?

హార్మోన్ల కన్ఫ్యూజన్ మన శరీరం 24 గంటల అంతర్గత గడియారం ప్రకారం పనిచేస్తుంది. దీన్నే సైన్స్ భాషలో 'సిర్కాడియన్ రిథమ్' అంటారు. టైమ్ మారితే రిథమ్ తప్పుతుంది. పడుకునే సమయం రోజుకో తీరుగా మారుతుంటే, మన శరీరంలోని హార్మోన్లు కన్ఫ్యూజ్ అయిపోతాయి. ఓవులేషన్ హార్మోన్లు రిలీజ్ అవ్వకుండా మొరాయిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో అండం విడుదల కావడానికి అవసరమైన ఎల్‌హెచ్ లాంటి హార్మోన్లు మనం గాఢ నిద్రలో ఉన్నప్పుడే విడుదలవుతాయి. నిద్ర సరిగ్గా లేకపోతే ఓవులేషన్ ఆలస్యం అవ్వడం లేదా అసలు జరగకపోవడం లాంటి సమస్యలు తలెత్తుతాయి.

### మహిళల్లో.. ముప్పు ఇలా!

నిద్ర తక్కువైతే మహిళల శరీరంలో కార్టిసాల్ (స్ట్రెస్ హార్మోన్), మెలటోనిన్ లెవల్స్ తలకిందులవుతాయి. అన్నీ బ్యాలెన్స్ తప్పుతాయి. ఇది నేరుగా ఈస్ట్రోజన్-ప్రొజెస్టిరాన్ బ్యాలెన్స్‌ను దెబ్బతీస్తుంది. అంతేకాదు.. పీరియడ్స్‌లో మార్పులు వస్తాయి. ఫలితంగా అండం నాణ్యత తగ్గడం, గర్భం దాల్చడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

### పురుషుల్లో.. ఇదీ పరిస్థితి

పురుషులపై కూడా నిద్రలేమి ప్రభావం తీవ్రంగా ఉంటుంది.



టెస్టోస్టిరాన్ లోపం: నిద్ర సరిగ్గా లేని పురుషుల్లో టెస్టోస్టిరాన్ లెవల్స్ తగ్గిపోతాయి. స్పెర్మ్ క్వాలిటీ: ఇది నేరుగా స్పెర్మ్ కౌంట్, దాని కదలిక, ఆకృతిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కొద్దిరోజుల పాటు నిద్రను నిర్లక్ష్యం చేసినా ఈ మార్పులు కనిపిస్తాయట.

ఇన్సులిన్-స్ట్రెస్: నిద్రలేమి వల్ల శరీరంలో ఇన్సులిన్ రెసిస్టెన్స్ పెరుగుతుంది. అంటే ఇది ఒబేసిటీకి దారితీయడమే కాకుండా శరీరంలో వాపు, ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని పెంచుతుంది. ఇవన్నీ కలిసి ఫెర్టిలిటీని దెబ్బతీస్తాయి. సంతానోత్పత్తి సామర్థ్యం కేవలం వయసు లేదా శరీర నిర్మాణం మీద మాత్రమే ఆధారపడి ఉండదు. ఈ విషయంలో మన జీవనశైలి కూడా ప్రభావం చూపుతుంది. అందుకే.. నిద్ర అనేది లగ్జరీ కాదు, అది మన రీప్రొడక్టివ్ హెల్త్‌కి ఒక 'బయోలాజికల్ అవసరం' అని గుర్తించండి. కంటి నిండా నిద్రపోవడాన్ని అలవాటుగా చేసుకోండి.



# జడేజా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకుంటున్నాడా?

భారత్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా ఉన్న రవీంద్ర జడేజా కెరీర్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్టు కనిపిస్తోంది. గత దశాబ్ధం కాలంగా మూడు ఫార్మాట్‌లలో టీమ్ ఇండియాకు వెన్నెముకగా నిలిచిన ఈ సౌరాష్ట్రస్టార్ తాజాగా తన రిటైర్మెంట్‌పై చేసిన వ్యాఖ్యు సంచలనంగా మారుతున్నాయి. ఇటివల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జడేజా ప్రదర్నఆశించిన స్థాయిలో లేదు. ఆల్‌రౌండర్‌గా జట్టులో తన ప్రాధాన్యతను నిరూపించుకోవాల్సిన చోట ఆయన విఫలమయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, అలాగే బ్యాటింగ్‌లో మూడు ఇన్నింగ్స్‌లు ఆడి కనీసం 30 పరుగులు కూడా చేయలేకపోవడం అభిమానులను, విశ్లేషకులను విస్మయానికి గురి చేసింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వీడియో విపరీతంగా వైరల్ అవుతుంది. అందులో రవీంద్ర జడేజా, వికెట్ కీపర్ బ్యాట్ రిషబ్ పంత్ ఒక కార్యక్రమంలో పాల్గొని సరదాగా ముచ్చటించారు. ఆ సమయంలో వారిద్దరినీ మీరు ఎప్పుడైనా సినిమాల్లో నటించాలని అనుకున్నారా అని ప్రశ్నించగా పంత్ సమాధానమిస్తూ.... నేను ఇంకా దాని గురించి ఆలోచించలేదు. నన్ను క్రికెట్ ఆడనివ్వండి, జడేజా భాయ్ గురించి నాకు తెలియదు. అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి జడేజా స్పందిస్తూ నవ్వుతూనే ఒక బాంబు పేల్చారు. అంటే నా సమయం అయిపోయిందని పరోక్షంగా చెబుతున్నాడు అని జడేజా వ్యాఖ్యానించారు. పైకి ఇది నవ్వుతూ అన్న మాట అయినప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రస్థానం ముగింపు దశకు చేరుకుదని సంకేతాన్ని ఆయన ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 2024 టీ 20 ప్రపంచ కప్ తర్వాత జడేజా టీ 20 ఇంటర్నేషనల ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను ప్రస్తుతం ఆయన కేవలం టెస్టు, వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. జడేజా తర్వాత వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లలో ఒకరు వన్డేలలో అతని స్థానంలో రావచ్చు. అయితే, ఇద్దరు ఆటగాళ్లు చాలా కాలంగా భారతదేశం కోసం వన్డే క్రికెట్ ఆడుతున్నారు. అక్షర్ ఇప్పటివరకు 71 వన్డేలు, వాషింగ్టన్ 29 వన్డే మ్యాచ్‌లు ఆడారు.

## జడేజా కోహ్లీని చూసి నేర్చుకోవాలి: అశ్విన్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తరహాలో జడేజా తన ఆటను మెరుగుపర్చుకోవాలని సూచించాడు.ఆటలో కొత్త ప్రయోగాలు చేయాలని జడేజాకు తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, కానీ అతను తన బౌలింగ్ శైలిని మార్చుకోడని చెప్పాడు. కొన్నేళ్లుగా బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడగా రాణిస్తుండటంతోనే జడేజా ఇలా మొండిగా తయారయ్యాడని తెలిపాడు.న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో జడేజా దారుణంగా విఫలమయ్యాడు. బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపర్చిన జడేజా బౌలింగ్‌లో ఒకే ఒక్క వికెట్ తీసాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం టీమిండియా విజయవకాశాలను ప్రభావితం చేసింది. ఈ సిరీస్‌లో 2 1తో భారత్ ఘోర పరాజయం చవిచూసింది.ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా జడేజా గురించి మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జడేజాకు తాను నమ్మే కొన్ని బలాలు ఉన్నాయి. అతను తన బలాలకు మించి ఏమి చేయడు. కాస్త నెమ్మదిగా.. భిన్నంగా బౌలింగ్ చేయాలని సూచించినా పట్టించుకోడు. ఎందుకంటే జడేజా తన బలాలను నమ్ముకొనే బౌలింగ్ చేస్తాడు.అతని బలాలే కొన్నిసార్లు బలహీనతలుగా మారుతున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో అతనికి ఉన్న నైపుణ్యం అసాధారణం. కానీ కొత్త ప్రయోగాలు చేయడు. నెట్స్‌లో క్యారమ్ బాల్స్ వేస్తాడు, కానీ మ్యాచ్‌లో మాత్రం ప్రయత్నించడు. లెజెండ్ అయిన జడేజాకు కోల్పోయేదేమీ లేదు. కొంచెం ఫంకీగా ఆడితే చూడాలని ఉంది. అతను నిరూపించుకోవాల్సింది కూడా ఏం లేదు. ఎప్పటికీ జడేజా దిగ్గజమే.విరాట్ కోహ్లీలా జడేజా కూడా తన ఆటను మెరుగుపర్చుకోవాలి. కోహ్లీ ప్రస్తుతం ఎలాంటి చింత లేకుండా ఆడుతున్నాడు. ఈ ప్రపంచానికి తానే రాజును అన్నట్లు ఆటను ఆస్వాదిస్తున్నాడు. అందుకే అతను ఇంత బాగా రాణిస్తున్నాడు.జడేజాకు ఇది సవాల్‌తో కూడిన సమయం. అక్షర్ పటేల్ అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్దంగా ఉన్నాడు. జడేజా వన్డేల్లో ఎన్నో గొప్ప ప్రదర్శనలు చేశాడు. కానీ ఇప్పుడు చర్చంతా అతని బ్యాటింగ్ చుట్టూనే తిరుగుతోంది. స్పిన్నర్లపై తక్కువ స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. అయితే ఇప్పుడే ఎవరి భవిష్యత్తుపై తీర్పు ఇవ్వడం తొందరపాటు అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# తిలక్ వర్మ ప్లేస్‌లో ఆడేది ఎవరు?

**నేటినుండి విండీస్‌తో**
**భారత్ తొలి టీ20 మ్యాచ్**
**జట్టులో కొన్ని కీలక మార్పులకు అవకాశం**
**జట్టులోకి రానున్న శ్రేయస్ అయ్యర్**



వన్డే సిరీస్‌ను కోల్పోయిన కసిలో ఉన్న టీమిండియా, ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో కివీస్‌ను దెబ్బకొట్టేందుకు సిద్ధమైంది. నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా బుధవారం (జనవరి 21) రాత్రి 7 గంటలకు తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం కానుంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ గాయం కారణంగా ఈ సిరీస్‌లోని మొదటి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ. అతనికి ఆపరేషన్ జరగడంతో, అతని స్థానంలో వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే, టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో ఉన్న ఇషాన్ కిషన్ కూడా రేసులో ఉన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడిస్తారా లేక శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అయ్యర్ ప్రస్తుతం వరల్డ్ కప్ జట్టులో లేనందున, బ్యాకప్ ప్లేయర్‌గా అతన్ని పరీక్షించే అవకాశం ఉంది. ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి సంజూ శాంసన్ వచ్చే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బాధ్యతలతో పాటు ఓపెనర్‌గా సంజూ తన మార్క్ చూపించాల్సి ఉంది. వన్డేల్లో వైఫల్యాలు చవిచూసిన సూర్యకుమార్ యాదవ్, తనకు ఇష్టమైన టీ20 ఫార్మాట్‌లో మళ్ళీ ఫామ్ అందుకోవాలని చూస్తున్నాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివం దూబేలు జట్టుకు బలాన్ని ఇస్తున్నారు. ఇక ఫినిషర్ పాత్రలో రింకూ సింగ్ మరోసారి తన పవర్ చూపించడానికి సిద్ధమయ్యాడు. బౌలింగ్ విషయానికి వస్తే.. జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు పేస్ బాధ్యతలు మోయనున్నారు. నాగ్‌పూర్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది కాబట్టి, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా బరిలోకి దిగడం ఖాయం. మరో స్పిన్ ఆప్షన్‌గా రవి బిష్ణోయ్ లేదా కుల్దీప్ యాదవ్‌లలో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, ఈ టీ20 సిరీస్‌ను విజయంతో ప్రారంభించి వరల్డ్ కప్ ముందర ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని భావిస్తోంది.

# ఫ్యాన్స్‌ను నిరాశపరుస్తున్న గంభీర్ కోచింగ్



టాలెంటెడ్ ఆటగాళ్లు, ఎంతో అనుభవం ఉన్న సీనియర్లతో కళకళలాడే భారత జట్టుకు ఇప్పుడు కాలం కలిసి రావడం లేదు. ముఖ్యంగా గౌతమ్ గంభీర్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి టీమచవతీతీచండియా ఊహించని రీతిలో ఘోరమైన ఓటములను చవిచూస్తోంది. మొన్న ఆదివారం ఇండోర్‌లో జరిగిన మూడో వన్డేలో న్యూజిలాండ్ చేతిలో 41 పరుగుల తేడాతో ఓడిపోవడమే దీనికి నిదర్శనం. విరాట్ కోహ్లీ సెంచరీతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. గంభీర్ హయాంలో భారత్ ఎదుర్కొన్న ఆ 5 చేదు జ్ఞాపకాలు ఏంటి అనే వివరాల్లోకి వెళితే..టీమచవతీతీచండియా చరిత్రలోనే న్యూజిలాండ్ జట్టు మన దేశానికి వచ్చి వన్డే సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1988 నుంచి 2023 వరకు కివీస్ టీమ్ భారత్‌లో ఏడు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడితే ఏడింటిలోనూ ఓడిపోయింది. కానీ ఈసారి మాత్రం వారు 2-1తో సిరీస్‌ను కైవసం చేసుకుని గంభీర్ కోచింగ్‌లో భారత్‌కు మొదటి దారుణమైన పరాభవాన్ని మిగిల్చారు. అసలు ఇలాంటి రీతిలో సిరీస్ చేజారుతుందని ఎవరూ ఊహించలేదు. జట్టు మంచి ఫామ్‌లో ఉన్నట్లు అనిపిస్తున్నా ఫలితం మాత్రం దారుణంగా ఉంటోంది. నవంబర్ 2024లో న్యూజిలాండ్ జట్టు భారత్‌లో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి చరిత్ర సృష్టించింది. కనీసం మూడు మ్యాచులు ఉన్న టెస్ట్ సిరీస్‌లో భారత్ తన సొంత గడ్డపై వైట్‌వాష్ అవ్వడం ఇదే తొలిసారి. బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో భారత్ కేవలం 46 పరుగులకే ఆలౌట్ అవ్వడం కూడా గంభీర్ హయాంలోనే జరిగింది. టాప్ ప్లేయర్స్ అందరూ ఒకేసారి ఫామ్ కోల్పోవడం కూడా పెద్ద షాక్ అనే చెప్పాలి. బ్యాటింగ్ లైనప్‌లో క్లారిటీ లేకపోవడం ఈ పరాభవానికి ప్రధాన కారణమని కొందరు సీనియర్లు కామెంట్ చేశారు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన రెండు ఎడిషన్లలోనూ భారత్ ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచింది. కానీ గంభీర్ కోచ్‌గా ఉన్నఈ సమయంలో 2027 డబ్ల్యూటీసీ ఫైనల్‌కు దాదాపు దూరమైంది. న్యూజిలాండ్‌తో జరిగిన 3-0 ఓటమి, ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం వల్ల భారత్ ఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. ఇప్పుడు డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో 48.15 పాయింట్ పర్సెంటేజీతో ఆరో స్థానంలో ఉంది. ఇకపై భారత్ ఇంకా తొమ్మిది టెస్టులు (శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌తో 2, ఆస్ట్రేలియాతో 5) ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌ల్లో వరుస విజయాలు నమోదు చేస్తే 74.07 పర్సెంటేజీకి చేరుకుంటుంది. అప్పుడు ఫైనల్ చేరేందుకు అవకాశాలు ఉ ంటాయి. కానీ ఇది జరగడం అంత సులభం కాదు! అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌కు డిమాండ్ పెరుగుతున్న క్రమంలో టీమచవతీతీచండియా నుంచి ఇలాంటి ప్రదర్శన ఫ్యాన్స్‌ను నిరాశపరిచింది. ఆగస్టు 2024లో శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 2-0తో కోల్పోయింది. గత 27 ఏళ్లలో శ్రీలంక చేతిలో భారత్ ద్వైపాక్షిక వన్డే సిరీస్ ఓడిపోవడం ఇదే మొదటిసారి. అంతకుముందు 1997లో శ్రీలంక చేతిలో ఓడిపోయిన భారత్, ఆ తర్వాత వరుసగా 13 సిరీస్‌లలో ఓటమి లేకుండా దూసుకుపోయింది. కానీ గంభీర్ రాకతో ఆ రికార్డు బ్రేక్ అయ్యింది. శ్రీలంక ఇతర చిన్న జట్లతో ఓడిపోతున్న సమయంలో భారత్‌ను ఓడించడం పెద్ద షాక్ అనే చెప్పాలి. గడిచిన పదేళ్లలో భారత్ ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా చేతిలో బోర్డర్ గావస్కర్ ట్రోఫీని కోల్పోలేదు. 2018-19 అలాగే 2020-21 లో ఆస్ట్రేలియా గడ్డపైనే వారిని ఓడించి వరుసగా నాలుగుసార్లు ట్రోఫీని నిలబెట్టుకుంది. అయితే 2024-25 లో గంభీర్ కోచింగ్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్ 3-1తో సిరీస్‌ను కోల్పోయి, పదేళ్ల తర్వాత ట్రోఫీని ప్రత్యర్థికి అప్పగించింది. గంభీర్ కోచ్‌గా వచ్చిన తర్వాత జట్టులో ఆ దూకుడు తగ్గిందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఈ ఐదు ఘోర పరాభవాలు కూడా జట్టుపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. మరి రాబోయే టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీల్లోనైనా టీమచవతీతీచండియా ఈ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తుందో లేదో వేచి చూడాలి.

# గంభీర్ తప్పిదం వల్లే ఘోర ఓటమి

**వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం ఎదురైందని వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే అన్నాడు. జట్టులో తరుచూ మార్పులు చేయడం టీమిండియా ఓటమిని శాసించిందని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో టీమిండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచిన టీమిండియా.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. 38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ తొలి వన్డే సిరీస్ గెలిచింది. ఈ పరాజయం నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ పరాజయంపై మాట్లాడిన రహానే.. టీమిండియా ఓటములపై బరాబర్ ప్రశ్నలు వస్తాయని తెలిపాడు. 'జట్టు ప్రదర్శనపై కచ్చితంగా కఠినమైన ప్రశ్నలు ఎదురవుతాయి. భారత్ గత 9 వన్డేల్లో ఐదు ఓడిపోయింది. అందుకు కారణం.. జట్టులో అతిగా మార్పులు చేయడం. అందుకే మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు తమ స్థానాలపై భరోసా కావాలని చెబుతున్నా. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు సిద్ధమవుతున్నప్పుడు మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు భద్రతతో పాటు స్పష్టత అవసరం. ఒక నిర్దిష్ట ఫార్మాట్‌లో కొందరు ఆటగాళ్లను ఆడించాలనుకున్నప్పుడు.. ఆ విషయంలో వారికి స్పష్టత ఉ ండాలి. ఓటములు ఎదురైనప్పుడు ప్రశ్నలు వస్తాయి. అది చాలా సహజం. ఎందుకంటే అభిమానులు భారత క్రికెట్‌తో అంతగా ముడిపడి ఉంటారు. భారత బాగా ఆడాలని, మ్యాచ్ గెలవాలని, సిరీస్ గెలవాలని కోరుకుంటారు. ముఖ్యంగా భారత్‌లో ఆడుతున్నప్పుడు ఓటమిని ఏ మాత్రం సహించరు. న్యూజిలాండ్‌ది ఏ టీమ్? బీ టీమ్ కావచ్చు. కానీ భారత్ సునాయసంగా 3-0తో ఈ సిరీస్ గెలుస్తుందని అంతా భావించాం. భారత జట్టుపై అంతలా అంచనాలు ఉన్నాయి. కానీ న్యూజిలాండ్ ఆడిన తీరు అద్భుతం. భారత్ కేవలం ప్రక్రియను నమ్ముకోవాలి. మరో ఆరు నెలల వరకు భారత్‌కు వన్డే సిరీస్ లేదు. జట్టును తిరిగి సిద్దం చేసుకోవడానికి మేనేజ్‌మెంట్ ఈ సమయాన్ని ఉపయోగించుకోవాలి. టీ20 ప్రపంచకప్ తర్వాత కూడా ఖాళీ సమయం లభించనుంది. సరైన ఆటగాళ్లను ఎంచుకోవడంతో పాటు కాంబినేషన్‌ను కనుగోవడం, ఆటగాళ్లకు మద్దతుగా నిలవడం కీలకం.'అని రహానే చెప్పుకొచ్చాడు.

# స్టేడియంలో చెలరేగిన మంటలు.. ప్రాణభయంతో పరుగులు తీసిన జనం!



ఆస్ట్రేలియాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళవారం (జనవరి 20) పెర్త్ వేదికగా పెర్త్ స్కార్చర్స్, సిడ్నీ సిక్సర్స్ మధ్య క్వాలిఫైయర్ మ్యాచ్ జరుగుతుండగా, స్టేడియంలోని ఒక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెర్త్ ఆప్టస్ స్టేడియం భవనానికి బయటి వైపు ఉన్న ఒక గది నుంచి నల్లటి పొగ భారీగా ఆకాశంలోకి వ్యాపించడంతో స్టేడియంలో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఈ ఘటన జరగడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పెర్త్ స్కార్చర్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో స్టేడియం భవనం నుంచి పొగ రావడం టీవీ స్క్రీన్లపై స్పష్టంగా కనిపించింది. వెంటనే అప్రమత్తమైన స్టేడియం సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక దళం అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం స్టేడియం బయటి గదిలో జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటగాళ్లకు లేదా ప్రేక్షకులకు ఎటువంటి హాని కలగలేదు. కాసేపు గందరగోళం నెలకొన్నప్పటికీ, మంటలు అదుపులోకి రావడంతో మ్యాచ్‌ను యథావిధిగా కొనసాగించారు. అయితే, ఇటీవల సౌతాఫ్రికాలో జరిగిన ఎా20 మ్యాచ్ సందర్భంగా స్టేడియం పార్కింగ్‌లో మంటలు రావడం, ఇప్పుడు బిగ్ బాష్‌లో ఇలా జరగడం క్రికెట్ వర్గాల్లో చర్చకు దారితీసింది. మ్యాచ్ విషయానికి వస్తే.. ఈ క్వాలిఫైయర్ పోరులో పెర్త్ స్కార్చర్స్ బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. ఓపెనర్ ఫిన్ అలెన్ 30 బంతుల్లో 49 పరుగులతో మెరుపులు మెరిపించినప్పటికీ, మిగిలిన వారు తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు. కెప్టెన్ ఆష్టన్ టర్నర్ 29 పరుగులు చేయగా, పర్త్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 147 పరుగులు మాత్రమే చేయగలిగింది. సిడ్నీ సిక్సర్స్ బౌలర్లు మిచెల్ స్టార్క్, బెన్ ద్వార్షుయిస్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి పర్త్ జట్టును కట్టడి చేశారు. స్టేడియంలో మంటల టెన్షన్ ఉన్నప్పటికీ, మైదానంలో ఆట మాత్రం రసవత్తరంగా సాగింది.

# ఆలోచింప చేసే అద్భుత సినిమా దండోరా

## సినిమాను చూసి మెచ్చుకున్న ఎన్టీఆర్




తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

# బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా



ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.



# దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.



# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా

## హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు




తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాధ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు



టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ్' అనంతరం ఆయన తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది.తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# స్టన్నింగ్ లుక్‌లో సెగలు పుట్టిస్తున్న రాశీ ఖన్నా!

రాశీ ఖన్నా.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. యువత ఫేవరెట్ హీరోయిన్‌గా పేరు దక్కించుకున్న ఈ సుందరి.. తొలిసారి 2013లో విడుదలైన 'మద్రాస్ కెఫే' అనే అని హిందీ చిత్రంలో భారత ఇంటెలిజెన్స్ అధికారి విక్రమ్ సింగ్ భార్య రూబీ సింగ్ పాత్ర ద్వారా సినీ రంగా ప్రవేశం చేసింది. రూబీ సింగ్ పాత్రలో నటించడానికి ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది రాశి ఖన్నా. తెలుగులో తొలిసారి అక్కినేని ఫ్యామిలీ ప్రెస్టేజియస్ మూవీగా నిలిచిన 'మనం' సినిమాలో చిన్న పాత్ర పోషించి తెలుగు తెరకు పరిచయ-మైంది. ఈ ఒక్క పాత్ర ఈమెకు హీరోయిన్గా అవకాశం అందేలా చేసింది. అలా తొలిసారి 'ఊహలు గుసగుసలాడే' అనే సినిమాలో శ్రీ సాయి శిరీష ప్రభావతి అనే పాత్ర పోషించి తన నటనతో అందరినీ ఆకట్టుకోవడమే కాకుండా హీరోయిన్గా మంచి పేరు దక్కించుకుంది.. ఈ సినిమా తర్వాత వరుసగా జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీం , హైపర్ , జై లవకుశ, రాజా ది గ్రేట్, శ్రీనివాస కళ్యాణం ఇలా పలు తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె.. ఇటు తెలుగులోనే కాకుండా అటు తమిళ్లో కూడా వరుస సినిమాలు చేసి మెప్పించింది. ఇకపోతే వరుసగా చిత్రాలు చేస్తోంది కానీ స్టార్ హీరోయిన్ రేంజ్ లో అవకాశాలు అయితే లభించడం లేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది. ఇందులో శ్రీలీల మరో హీరోయిన్గా నటిస్తున్న విషయం తెలిసిందే.. మరోవైపు మరో తెలుగు చిత్రంలో నటిస్తున్న ఈమె అటు హిందీ ' నాగ్జిల్లా: నాగ్ లోక్ కా పెహ్లాకాంద్' అనే హిందీ సినిమాలో కూడా నటిస్తోంది. అంతేకాదు విక్రాంత్ మాస్సే హీరోగా నటిస్తున్న ఒక హిందీ సినిమాలో కూడా అవకాశం దక్కించుకుంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అలాగే హిందీ వెబ్ సిరీస్ ఫర్జీ 2 లో కూడా రాశిఖన్నా నటిస్తోంది. షాహిద్ కపూర్ తో కలిసి ఈ సీక్వెల్ లో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. అంతేకాదు ఆర్ మాధవన్ తో కలిసి ఒక టైం ట్రావెల్ మూవీ చేస్తున్న ఈమె ఒక పంజాబీ వెబ్ సిరీస్ లో కూడా నటిస్తోంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463